క్లుప్తంగా

సమాజానికి సందేశం ఇవ్వటమే లక్ష్యం



'గమ్య స్థానాలవైపు' నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: సమాజానికి సందేశం ఇవ్వటమే సాంఘిక నాటకాల లక్ష్యమని ప్రముఖ సినీ రచయిత తోటపల్లి సాయినాథ్ అన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో సాంఘిక నాటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహబుబ్ బాషా మాట్లాడారు. అనంతరం తెనాలి కొలకలూరి శ్రీ సాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'గమ్య స్థానాల వైపు', 'ప్రేమతో నాన్న' నాటకాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో రచయిత, దర్శకులు గోపరాజు విజయ్, నాటకాల నిర్వహణ కన్వీనర్ లక్ష్మీకాంతరావు, కళాక్షేత్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



స్విమ్మర్ శృతిని సన్మానిస్తున్న ఇంటెలిజెన్స్ డీఎస్పీ తదితరులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు ఇంటెలిజెన్స్ డీఎస్పీ జి.వెంకటరాముడు అన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన 66వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లు వై.దేవ్‌శృత్ సాయి, కె.శృతిలను జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. అదేవిధంగా వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. కురువ సంఘం గౌరవాధ్యక్షుడు కె.క్రిష్టన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి, కోశాధికారి కె.సి.నాగన్న, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఆర్‌వీపీఎస్ అధ్యక్షుడు రవికుమార్, అమీలియో హాస్పిటల్ అధినేత లక్ష్మీ ప్రసాద్ చాపే తదితరులు పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

- నూతన నగర అధ్యక్షుడుగా నారాయణ



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దిలేటి

కర్నూలు(అగ్రికల్చర్): ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సంఘం కర్నూలు నగర శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం కర్నూలు ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా శాఖ అధ్యక్షుడు ఇ.మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడుగా వి.నారాయణ(కర్నూలు ఏడీఏ కార్యాలయం) ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడుగా ఎస్.నాగరాజు(వ్యవసాయశాఖ విశ్రాంత ఉద్యోగి), ఉపాధ్యక్షులుగా కె.పుల్లయ్య(డీఈవో కార్యాలయం), జీవన్‌కుమార్(సమాచార, పౌరసంబంధాల శాఖ), నగర కార్యదర్శిగా కె.నాగరాజు(జిల్లా సహకారశాఖ), జాయింట్ సెక్రటరీలుగా బి.చంద్రశేఖర్(బి.క్యాంపు బాలుర హైస్కూల్), బి.గోపి(జిలా వ్యవసాయ శాఖ), కోశాధికారిగా జి.మద్దయ్య(భూసంరక్షణ ఏడీ కార్యాలయం) ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఈ నెల 19 నుంచి మూడేళ్లు కొనసాగుతుంది.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వాల్తేరు వీరయ్య, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, శ్రీదేవి శోభన్‌బాబు
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్ : పఠాన్, మేఖేల్, షెహ్జాదా
రాజ్ : వినరో భాగ్యము విష్ణు కథ
శ్రీరామ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా
విజయ: సార్

తీపి శత్రువు...

జిల్లాలో 23,52,639 మంది జనాభా ఉండగా ఇప్పటి వరకు 17,35,659 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, హెల్త్ ఐడీ కార్డులు జనరేట్ చేశారు. ఇందులో 30 ఏళ్లపైడిన వారు 9,29,668 మంది ఉండగా వారిలో బీపీ నిర్ధారణ అయిన వారు 38,824 మంది, బీపీ లక్షణాలున్న వారు 1,212,740 మంది ఉన్నారు. అలాగే షుగర్(మధుమేహం) నిర్ధారణ అయిన వారు 27,959 మంది ఉండగా, షుగర్ లక్షణాలున్న వారు 1,27,883 మంది ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. షుగర్ శరీరానికి పెద్ద శత్రువు. పేరులో తీపిని దాచుకున్న ఈ మహమ్మారి శరీరాన్నంతా గుల్లచేస్తోంది. నియంత్రణలో లేకపోతే శరీరంలోని ప్రధాన అవయవాలను దెబ్బతిస్తుంది.



- షుగర్ వచ్చిందంటే శరీరం గుల్లే
- నియంత్రణ లేకపోతే అనేక సమస్యలు
- కిడ్నీ, గుండె, నాడీ మండలాలకు ఇబ్బందులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో గత కొన్నేళ్లుగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) పేరుతో సర్వే చేస్తున్నారు. ఈ మేరకు ప్రజలను పరీక్షించి వారికి హెల్త్ ఐడీ కార్డులు క్రియేట్ చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. మొత్తంగా అన్ని వర్గాల ప్రజల్లో 13.13శాతం మందికి బీపీ, మరో 13.78శాతం మందికి షుగర్ ఉన్నట్లు ఇప్పటి వరకు తేలింది. వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా అందజేస్తున్నారు. అలాగే ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి నెలా 25వేల మంది షుగర్ బాధితులకు, 37వేల మంది బీపీ బాధితులకు మందులు, చికిత్స అందిస్తున్నారు. వీరు గాక నగరాల్లో, పట్టణాల్లో ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స తీసుకుంటున్న వారు 2 లక్షల మందికి పైగానే ఉంటారని అంచనా. మొత్తంగా జనాభాలో 18శాతం మందికి షుగర్, 20శాతానికి పైగా బీపీ ఉంటుందని వైద్యులు అంచనా వేస్తున్నారు.

కిడ్నీలు అతలాకుతలం

షుగర్, బీపీ నియంత్రణలో లేకపోతే ముందుగా దెబ్బతినేది కిడ్నీలేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే వారి వద్దకు వెళ్లే రోగులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయిస్తుంటారు. రక్తంలో క్రియాటినిన్ లెవెల్స్ పెరిగిన వెంటనే చికిత్స ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే రోజుకు వంతుల వారీగా 50 నుంచి 80 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నారు.

ఇన్‌ఫెక్షన్ సోకితే కాలికి ముప్పే:

షుగర్ రోగులకు కాలుకు దెబ్బతగలకుండా చూసుకోవాలి. ఒక్కసారి దెబ్బతగిలిందా అది ఇన్‌ఫెక్షన్‌కు దారి తీయకుండా జాగ్రత్త పడాలి. షుగర్ రోగుల్లో అధిక శాతం మందికి న్యూరోపతి వస్తుంది. అంటే కాలిచివరి భాగంలో పాదాలు, వేళ్లలో నరాలు పనిచేయక మొద్దుబారి పోతాయి. దాని వల్ల ఆ ప్రాంతంలో స్పర్శ కనిపించదు. దీంతో గాయం తగిలినా చాలా మందికి తెలియదు. అది పెద్దగా మారి ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసేంత వరకు చాలా మంది చూసుకోలేరు. గాయం మానడానికి చాలా సమయం పడుతుంది. కొంతమందిలో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై కాలు కొంత భాగం వరకు తొలగించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇకపోతే ఎక్కువగా షుగర్ నియంత్రణ లేనివారిలో గుండెపోటుతో పాటు కంటి జబ్బులు, క్షయ వ్యాధి ప్రభావం అధికంగా కనిపిస్తుంది.

పరీక్షలు చేయించుకోవాలి



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కిడ్నీ సమస్యలతో వచ్చే వారిలో 50శాతం మంది షుగర్ రోగులే ఉంటున్నారు. అధిక శాతం కిడ్నీలు ఫెయిలైన దశలో వీరు వస్తున్నారు. వైద్యుల సూచనతో షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి బ్లడ్ యూరియా, సీరమ్ క్రియాటినిన్ పరీక్షలు చేయించుకోవాలి. – **డాక్టర్ వెంకట పక్కిరెడ్డి, నెఫ్రాలజిస్టు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల**

మధ్యవయస్సులో అనేక సమస్యలు



ఇటీవలకాలంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో, ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవారిలో, నైట్ డ్యూటీలు ఎక్కువగా చేసే వారిలో షుగర్ వస్తోంది. చిన్న వయస్సులో వారికి షుగర్ రావడం వల్ల మధ్యవయస్సు వచ్చే సరికి అనేక సమస్యలు వస్తున్నాయి. రోజూ వాకింగ్ చేయడంతో పాటు ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. –**డాక్టర్ పి. శ్రీనివాసులు, ఎండోక్రైనాలజి హెచ్‌వోడీ, కర్నూలు ప్రభుత్వ వెద్యశాల**

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం ఇస్కాన్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పఠనం, హరే రామ హరే కృష్ణ సంకీర్తన జపం చేశారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు మహా రాజ భోగ నివేదన చేసి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదిక బాలోత్సవం

కర్నూలు సిటీ: చిన్నారులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించి సృజనాత్మక వికాసం కలిగించే వేదిక బాలోత్సవమని మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత ఎం.రాజశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ స్కూల్‌లో ఏర్పాటు చేసిన బాలోత్సవ్ కార్యక్రమ కేంద్రాన్ని ఆయన పరిశీలించి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో బాలోత్సవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బాలోత్సవం -2023 నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి శేషయ్య, కన్వీనర్లు కెంగార మోహన్, ఎం.పి. బసవరాజు, కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం, ఆరోగ్యానికి ప్రాధాన్యత



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక తన కార్యాలయంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.4.60లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం పేదలు ఇబ్బందులు పడరాదని ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. అంతేగాక ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నారని చెప్పారు.

రమణీయం.. రూపాల సంగమేశ్వరుని రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కర్నూలు జగన్నాథ గట్టుపై వెలసిన ఉమా సమేత రూపాల సంగమేశ్వరుని రథోత్సవం ఆదివారం రమణీయంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో వేలాదిగా భక్తులు తరలి వచ్చి రథోత్సవంలో పాల్గొని తరించారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివ నామ స్మరణతో జగన్నాథ గట్టు మారుమోగింది. అంతకు ముందు ఉత్సవ మూర్తులను దేవాలయం నుంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవాల అధికారిణి కామేశ్వరి, ఆలయ ఈవో గుర్రెడ్డి, రూపాల సంగమేశ్వర జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి కార్యనిర్వాహక కార్యదర్శులు క్రిష్టన్న, మల్లికార్జునరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, తాలూకా పోలీస్ స్టేషన్ సీఐ రామలింగయ్య, దిన్నెదేవరపాడు గ్రామపెద్దలు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు.



ఉమా సమేత రూపాల సంగమేశ్వర్ల ఉత్సవ మూర్తులు

సంక్షిప్తం

● భక్తులకు తగ్గట్లు బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాల నుంచి వచ్చే భక్తుల రద్దీకి తగ్గట్లు ఇతర జిల్లాల నుంచి 170 బస్సులు తెప్పించి నడుపుతున్నామని ప్రజా రవాణ శాఖ కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● అలరించిన సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: ఆర్‌ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో గాయని రాణి అధ్యక్షతన యే షామ్ ఆప్ కే నామ్ పేరుతో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు హర్షద్, మహబుబ్ బాష, అమీర్, ఛాంద్ బాషా, జయపాల్, సుజాతలు ప్రసిద్ధ సినిమా పాటలు పాడారు.

● పోతులనాగరాజును గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): పీడీఎఫ్ బలపరుస్తున్న పోతులనాగరాజు యాదవ్‌ను పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని సీఐటీయూ నాయకులు అబ్దుల్ దేశాయ్, షరీఫ్, గౌస్‌బాషాలు ఆదివారం ఓల్డ్‌సిటీలో ప్రచారం నిర్వహించారు.

స్థాయీ సంఘ ఆమోదానికి బడ్జెట్ అంచనాలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ సాధారణ నిధులు, విద్యా నిధులకు సంబంధించి 2022-2023 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలు ఆమోదం, అలాగే 2023-2024 సంవత్సరపు బడ్జెట్ అంచనాలను తయారు చేసేందుకు స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు బడ్జెట్ అంచనాలు స్థాయీ సంఘ సమావేశం ఆమోదం, ఏకగ్రీవ తీర్మాణం పొందిన తరువాత నగరపాలక సర్వసభ్య సమావేశం ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు.

శివునికి అన్నాభిషేకం





మహాశివునికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: మహా శివరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా జరిగాయి. శివపార్వతుల కల్యాణం, పల్లకి సేవలు, రథోత్సవాలు, గ్రామోత్సవాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సంకల్‌బాగ్‌లోని హరి హరక్షేత్రంలో మహాశివునికి అన్నాభిషేకం నిర్వహించారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, కుటుంబ సభ్యులు రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా రంగనాథుడి శోభాయాత్ర



జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభిస్తున్న జీయర్ స్వామి

కర్నూలు కల్చరల్: శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి వివేకానంద సర్కిల్, మౌర్యా ఇన్, ఆర్‌ఎస్ రోడ్, నగర పాలక సంస్థ కార్యాలయం, ప్రకాష్ నగర్ మీదుగా వివిధ కళారూపాలు ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలతో మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులానికి నిర్వహించిన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. గోదాగోకులంలో గోదా సమేత రంగనాథ స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన మార్చి1వ తేదీన జరుగుతుందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు గోదా గోకులం చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. మారం నాగరాజు గుప్త మాట్లాడుతూ మార్చి 1న దేశంలోని వివిధ సాధుసంతులు, జీయర్ స్వాములు, పీఠాధిపతుల సమక్షంలో విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం, వేముల జనార్దన్, భూమా కృష్ణమోహన్, తక్లం సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న మహిళలు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ సతీమణీ స్వర్ణలత అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి విలువిద్య సీనియర్ స్థాయి ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడికి అభినందన



సాయి శంకర్‌ను నగదు, కప్‌తో అభినందిస్తున్న ఆదిమూలపు సతీష్ తదితరులు



కర్నూలు (టౌన్): ఇటీవల గుంటూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో కర్నూలు కర్నూలు మైపర్ టెన్నిస్ అకాడమీకి చెందిన డి.సాయిశంకర్ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారుడిని ఆదివారం స్థానిక మైపర్ టెన్నిస్ అకాడమీలో మైపర్ విద్యా సంస్థల అధినేత ఆదిమూలపు స్టెల్లా, ఆదిమూలపు సతీష్‌లు అభినందించారు. రూ.20 వేలు నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు.

తోటి మనుషులపై మానవత్వాన్ని చూపాలి



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి మనుషుల పట్ల మానవత్వాన్ని చూపాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సతీమణి స్వర్ణలత అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోదా హాస్పిటల్ వారి సహకారంతో ఆదివారం కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజానికి మానవత స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. మానవత సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కచ్చితమైన విధానాలతో సభ్యులు, దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సాధారణవ్యాధులతో పాటు గుండె, ఎముకలకు సంబంధించి పలు వైద్యపరీక్షలు, చికిత్సలను వైద్యులు సోమేష్ మంజునాథ, జితేందర్‌జైన్, శ్రీకాంత్‌రాజు, మేఘన, తేజస్వినిలు అందించారు. కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ డైరెక్టర్ పాటిల్ హనుమంతరెడ్డి, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎం.శివారెడ్డి, యాని ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి





శివాజీ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం, శోభాయాత్రలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ బండి మెట్ట బాల శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం శివాజీ విగ్రహంతో బండి మెట్ట నుంచి పూల బజార్, మించిన్ బజార్, పెద్దమార్కెట్, ఓల్డ్‌సిటీ, కోట్ల సర్కిల్, కిడ్స్ వరల్డ్ మీదుగా వివేకానంద సర్కిల్ వరకు శోభాయాత్ర చేపట్టారు. యువత, బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్ దల్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. విద్యార్థుల కర్రసాము, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అశ్వంపై శివాజీ వేషధారణతో గుర్రపు స్వారీ చూపరులను ఆకట్టుకుంది. కర్నూలు డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కగ్గోలు హరీష్, జిల్లా నాయకులు మద్దిలేటి, భజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, బాల శివాజీ యూత్ సభ్యులు కోటి, ప్రసాద్, రాహుల్, జ్ఞాని, నరేష్, వినోద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

వైవీ రావు సేవలు మరువలేనివి

కర్నూలు(సెంట్రల్): వైవీ రావు విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో పాల్గొంటూ ఏఐటీయూసీ, ఆర్‌టీసీ యూనియన్‌లో కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలు మరువలేనివని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో వైవీ రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ మాట్లాడుతూ.. వైవీ రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఏవీ రెడ్డు, మనోహర్ మాణిక్యం, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.